# "జీవచ్ఛవాలు"

పక్కింటిలోంచి ఉన్నట్టుండి ఏడుపులు, పెడబొబ్బలు వినిపించాయి. చుట్టుపక్కల వాళ్ళంతా రంగనాధంపంతులుగారింటికి చేరారు.

మంచంమీద రంగనాధంగారు వెల్లకితలాపడి వున్నారు. ఆయన గుండెలు ఎగిరిపడుతున్నాయి, రొప్పుతున్నారు. కళ్ళు మూతలుపడి వున్నాయి.

వనజమ్మ గుండెలు గబగబా బాదుకుంటూ, చిర్రూ బుర్రూ చీదుకుంటూ "అయ్యో, నా తండ్రీ – పొద్దున్న కూడా ఇంత ఆవకాయ వేయించుకుని సుభ్భరంగా దిష్టి తగులు తుందేమోరా అంత ఎర్రగా కలుపుకోకురా అని చెబుతున్నా ఆప్యాయంగా తిన్నావురా నాయనా. ఆ పాడుమునిషి పెరుగు మనిషి – అది చూసిందిరా, దాని కళ్ళుపడ్డాయిరా తండ్రీ – దిష్టితగు లేనే మంచిదిలే హాయిగా కళ్ళు మూసేస్తాను – దాని దగ్గరకు తొందరగా వెళ్ళిపోతాను అన్నావురా – అలా అవా చ్యాలు పలకవద్దని అంటున్నా అంతమాట అనేశావురా నా తండ్రీ – ఒక్కొక్క వేళ అన్నంతపనీ జరుగుతుందిరా. ఇంతట్లో నీ రోజులు తీరుతాయా అనుకున్నానురా నా తండ్రీ – ఇంత గడిస్తావని, పిల్లా పాపతో సుఖంగా వుంటావని అనుకున్నా నురా" అంటూ ఆవిడ విరామంలేకుండా గుండెలు పగిలేలా రోదిస్తూంటే అక్కడ చేరినవాళ్ళకి మనసులు కరిగిపోయాయి.

రంగనాథంగారు తాలూకాఫీసులో రిటైరై పోయి పది సంవత్సరాలయి పోయింది. రెండు చేతుల్లోనూ సంకోచం లేకుండా గడించారు గడించటం పురుషధర్మం కాబట్టి గడించ టంలో ఆయన వెనకా ముందూ మంచీ చెడూ అనేది చూడ కుండా రేపటి రోజులనేవి. భారం కాకుండా ఉండటంకోసరం దీపం అనేది వున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకున్నారాయన. సంపా దించిందంతా పైలాపచ్చీసు చేయలేదు. రూపాయి పైస సంపా దిస్తే పైసా సొంతానికి ఖర్చుచేస్తాడు; మిగతాది అవతల బ్యాంకులో పడేశారు. అదలా కొండలా పేరుకుపోయింది. కూతురుకి బయట సంబంధం అయితే గడించిందంతా దాని పుస్తి ముడి సంబంధానికే సరిపోతుంది. ఇక తనకి మిగిలేదేమీ వుండదనే ఉద్దేశ్యంతో ఆయన యీ విషయంలోకూడా అతి జాగ్రత్త తీసుకుని చిన్నప్పుడే తలచెడి ఒక్కగా నొక్క కొడుకుని పెట్టుకుని కాలక్షేపం చేస్తున్న చెల్లెమ్మను తెచ్చి తనదగ్గరే పెట్టుకున్నారు. మళ్ళీ తరవాత మనసులేం మార తాయోనని ఓ పేడాదిపాటు కుర్రవాడి బుద్ధి పరీక్ష చేసుకుని ఫరవాలేదని తృప్తిపడి కూతురు రాధమ్మనిచ్చి పెళ్ళి చేసీ శాడు. ఆ పెళ్ళికూడా గుట్టు చప్పుడు కాకుండా రెండో కంటి వాడికి తెలియకుండా చేసేశాడు.

అయితే ఆ పెళ్ళయిన మర్నాటినుంచే రంగనాథం గారికి మనశ్శాంతి కొరవడింది. ఆయన ప్లాను తల్లక్రిందు లైంది. అన్నగారు తన దగ్గరకు రమ్మన్నప్పుడు వనజమ్మ ఏం ఆలోచన చేసిందో అదంతా ఆచరణలో పెట్టింది. "రంగ నాథంగారు రోగిష్టిమనిషి. చీటికీ మాటికీ ఆయన కేదో

ముంచుకొస్తూనే వుంటుంది. ఎలాగూ యీ ముసలాడు నాల్గు రోజులు అటూ ఇటూగా హరీ మనేవాడేకాని పూర్ణాయుర్దాయం గలవాడు కాడు" అని ఆవిడ ఆయన రమ్మనటమే ఆలస్యం వెనకాడకుండా వచ్చేసింది. వచ్చిన మర్నాటినుంచే, ఆవిడ పొద్దున్నా, సాయంత్రం 'ఈయనగారి దీపం ఆర్పెయ్యరా బాబూ' అని తులసికోట దగ్గర దీపం వెలిగించేది. 'వీడి నోట్లో మట్టి కొట్టరా భగవాన్' అని దేముడికి మొక్కి ఆవిడ ఆయన విస్తట్లో అన్నం పడేసేది. 'ఇంట్లోంచేకాదు, ఏకంగా ఈ లోకంనుంచే వెళ్ళిపో' అని ఆవిడ, ఆయనగారు గుమ్మం అవతల అడుగు పెట్టేసరికల్లా తలుపు దభీమని వేసేది. 'ఇక మరి పొద్దున్నే లేవను. ఈ నిద్ర శాశ్వతం కావాలి భగవంతుడా' అని ఆవిడ రంగనాథంగారి మంచం వైపు మెటికలు విరిచి, ఆ చేతుల్తోనే దేముడికి దండం పెట్టేది.

కూతురు రాధమ్మని తండ్రి దగ్గరకు వెళ్ళనివ్వకుండా ఖడేరావు చేసింది. రంగనాథంగారు అల్లుణ్ని అదుపులోకి లాక్కోవాలని చూశారుగాని, అతగాడు తల్లిచాటు పిల్లాడయిపోయాడు. అమ్మని వొదిలిపెట్టి వాడు ఇవతలికి రాడు. రంగనాథంగారు డబ్బుఆశ చూపించారు. ఇచ్చిన డబ్బు పుచ్చుకుని వాడు మళ్ళీ తల్లిచాటుకే చేరేవాడు.

కొంపలో వున్నంతసేపూ ఇంట్లో సూటీ పోటీ మాటలు తప్పించుకుందుకు పెరట్లో రకరకాల మొక్కలు తెచ్చి నాటి, వాటికి సేవచేస్తూ కాలక్షేపం చేయాలను

కున్నారు రంగనాథంగారు. వనజమ్మ ఎవరూ చూడకుండా ఓనాడు వాటినన్నిటిని పీకేసి అవతల పారేసింది. రంగనాథం గారు లబలబ లాడితే, మేకలొచ్చి తినిపోయాయని అబద్ధం ఆడేసింది.

వేదాంత గ్రంథాలు తెచ్చుకుని ఇంట్లో పెట్టుకున్నారు తీరిక వేళల్లో చదువుకోవచ్చని. వనజమ్మ వాటిని తీసుకెళ్ళి ఇరుగింటి వాళ్ళకీ, పొరుగింటి వాళ్ళకీ పంచిపెట్టింది. రంగ నాథంగారు విసుక్కుంటే, "ఇరుగూ, పొరుగూతో అవసరా లంటూ వుండవా మనకు? నువ్వు తెచ్చే సరుకులతోనే నెల గడిచిపోతూం దనుకుంటున్నావా? ఎంతమంది దగ్గర అప్పులు చేస్తే నెలగడుస్తుందో నీకు తెలవదు. వెధవ పుస్తకాలు — కాస్త చదువుకుందుకిస్తే అంతగా బాధపడిపోతున్నావు" అంటూ గంటన్నరసేపు సాధించింది వనజమ్మ.

ఇంట్లో ఉన్నంతసేపూ సుఖంగా కాలక్షేపం కావటానికి రంగనాథంగారు ఏర్పాటుచేసుకున్న సదుపాయాలన్నీ వనజమ్మ భగ్నం చేస్తూవచ్చింది. ఆవిడ ఆంతర్యం రంగ నాథంగారు అర్థంచేసుకోలేకపోలేదు."ఆ డబ్బు తెచ్చి నాచేతిలో పడెయ్యి. పెత్తనం నాకు అప్పచెప్పు. నువ్వలా బొమ్మలా చూస్తుండు" అని ఆవిడ అభిప్రాయం.

*　　　*　　　*

వనజమ్మ ఇన్నాళ్ళుగా ఎదురుచూసిన ఘడియ ఈనాటికి వచ్చింది.

రంగనాథంగారు ఆ సాయంత్రం అప్పటికి ఓ గంట

శ్రీతమే శుభ్రంగా ముస్తాబయి మల్లు పంచ కట్టుకుని సిల్కు కండువా బుజంమీద వేసుకుని నవ్వుకుంటూ అలా స్నేహితుల్ని కలుసుకుందుకు వెళ్ళారు. వెళ్ళేటప్పుడు ఆగా రాయిలా, చేతిలో కర్రలా నిటారుగా, ఠీవిగా, దర్జాగా నాకే మన్నంత ధీమాగా వెళ్ళిన వ్యక్తి సాయంత్రం కనుచీకటి పడే సరికల్లా ఎవరో తోసినట్టుగా తూలుతూ ముందుకు పడిపోతూ రొప్పుతూ వచ్చి మంచంమీద పడిపోయారు. కళ్ళు మూతలు పడిపోయాయి. ఒళ్ళు జ్వరంతో పేలిపోతూంది. ఆయాసంతో ఆయన గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి.

చుట్టూ చేరిన వాళ్ళు గుడ్లు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా అలా వులుకూ పలుకూ లేకుండా చూస్తూ వుండిపోయారు.

ఇంతలో డాక్టరుగారు వచ్చారు. ఆయన ఓ పావుగంటసేపు పరీక్ష చేశారు. అబ్బో, సీరియస్ కేసే... అన్నట్టుగా కళ్ళు పెద్దవిచేసి కనుబొమలు ఎగరేశారు. రెండు మూడు సార్లు లాభం లేదన్నట్టుగా ఛీత్కారాలు చేశారు. నిట్టూర్చారు, ఏం చెప్పాలో తోచటం లేదన్నట్టుగా. చెప్పటానికి నోరు రావటం లేదన్నట్టుగా, ముఖం పెట్టారు. ఆఖరికి చెప్పక తప్పదుగనక తన బాధ్యత తాను తీర్చుకుంటున్నా నన్నట్టుగా "చూడమ్మా! ఇక ఈయన జీవించటం అనుమానం అయిన విషయం. తెల్లవారటం కష్టం" అనేసి చరచరా వెళ్ళిపోయారు.

వనజమ్మ భోరుమని రంగనాథంగారి గుండెలమీద పడిపోయి ఆయన శరీరాన్ని హూనం హూనం చేసిసింది.

అక్కడున్న వాళ్ళు హెచ్చరిస్తే వనజమ్మ రోషంగా వాళ్ళకేసి చూసింది, రుసరుసలాడుతూ.

ఆయన గుండెలమీద పడి తల మొత్తేసింది. అరి చేతుల్తో ఆయన ఛాతీని బాదేసింది.

పోయినవాళ్ళు పోగా, అక్కడున్న కొద్దిమందిని వన జమ్మ ప్రాధేయపడింది. "మీకు పుణ్యం ఉంటుంది. ఏం చేస్తాం తల్లీ, పోయినవాళ్ళతో పోలేంగా. ఈ పాడు పొట్ట తిప్పలు తప్పేవి కావు. కాస్త ఊరగాయ జాడీలు, పప్పు డబ్బాలు మీ యింట్లో పెట్టించండి. ఈ పదిరోజులూ పోయిం తర్వాత తెచ్చుకుంటా... చూస్తూ చూస్తూ వాటిని పార వెయ్యలేంగా తల్లీ ?"

వనజమ్మ అప్పటికప్పుడు పని గట్టుకుని అలమారాలు జాడీలన్నీ తీసుకెళ్ళి అవతల వాళ్ళింట్లో సర్దింది.

వనజమ్మ ధామ ధూములు కోడలిమీద ఎక్కువయి పోయాయి. "ఒసేవ్, ఇలారా. అక్కడ కూర్చుని ఏం లాభం కాని, వచ్చి ఈ వంటపని చూడు. అన్నం ఉడికీ ఉడక్కుండా, తగలెట్టకుండా కాస్త వళ్ళు దగ్గరపెట్టుకుని వండు. కూరలో ఉప్పు ఎక్కువ వేశావంటే ముఖాన్న కొడతా. అదిగో, చెబు తూనే ఉన్నా. అంతంత చెక్కలు తరిగేస్తే ఇక ఆ కూరగా మిగిలేదేవిటే? అలాగేనటే కూరలు తరగటం? అవ్వ!" అంటూ వనజమ్మ కోడల్ని వంటపనిలో కుక్కి, కొడుకుని పిలిచి వాడికో పని పురమాయించింది.

"ఒరేయ్ అబ్బాయి! చప్పున వీధి గేటుపక్కన నాలుగు రాటలు పాతి, పైన నాలుగు తడికలు పడెయ్య.

ఇవాళ నక్షత్రం బొత్తిగా సుంచిదికాదు. ఇంట్లోగనక ప్రాణం గుటుక్కుమంటే ఎన్నాళ్ళు పాడు పెట్టాల్సి వుంటుందోరా నాయనా. త్వరగా కానియ్యి. ఈ రాత్రికి మన ఖర్మ, జాగరణ ఎలాగూ తప్పేట్టులేదు..." అంటూ వనజమ్మ తల బాదుకుంది.

రాధమ్మ కన్నీరు గ్రుక్కుకుంటూనే వంట పని చేస్తోంది.

వనజమ్మ దగ్గరుండి గేటుపక్కన పందిరి వేయించింది. దానిపైన తడిక వేయించింది.

"ఒరేయ్, నువ్వు కాళ్ళు పట్టుకో, నేను తల పట్టుకుంటాను. కోడలు నడుం పట్టుకుంటుంది. ఒసేవ్, ఇలారా ఓసారి..." అంటూ ముగ్గురూ కలిసి రంగనాధంగార్ని సాయం పట్టి ఆ పందిరికింద పడుకోబెట్టారు.

ఓ మరచెంబునిండా నీళ్ళు పట్టుకుని వనజమ్మ భుక్తాయాసంతో గోడకి జారబడి కాళ్ళుచాపుకుని రంగనాధం గారి శరీరాన్ని చూస్తూ మధ్య మధ్య కళ్ళు వత్తుకుంటూ, పళ్ళు కొరుక్కుంటూ, లోపల్లోపల గింజుకుంటూ, అలాగే కాపలా కూర్చుంది.

రాత్రి కొద్దిగా చినుకులు పడటం ఆరంభించింది. వనజమ్మ గబగబా లోపలికిపోయి తలుపులు వేసుకుని పడుకుంది. మళ్ళీ ఆవిడ తలుపులు తీసుకుని ఇవతలకి వచ్చేసరికి రంగనాధంగారు కాళ్ళు తప తప కొట్టుకుంటున్నారు.

"సంధించింది. ఇక ఎక్కువసేపు ప్రాణం వుండదు"

అనుకుంది వనజమ్మ. ఎందుకైనా మంచిదని ఓసారి పెద్దగా బావురుమంది.

వనజమ్మ ఏడుపు విని చుట్టుపక్కల వాళ్ళంతా లేచి వచ్చారు. హారికేన్ లాంతరు వెల్తురులో ఆయన కాళ్ళు తప తప కొట్టుకోవటం చూసి ఎవరిమటుకు వారు చల్లగా జారుకో బోతూంటే _

వనజమ్మ రంగనాధంగారి పాదాలుతాకి చూసి "చల్ల బడిపోయాయిరా నాయనా. ఇంకెంతసేపుంటావురా... చూడ లేకుండా వున్నారా నాయనా, నీ బాధ. అయ్యో, ఒళ్ళంతా మంచులా చల్లబడి పోతూందండీ_బాబ్బాబు, మీకు పుణ్యం వుంటుంది. ఆ తర్వాత ఈ ఘటాన్ని కాస్త అక్కడికి చేర్చి ఆ కాస్తపనీ కూడా పూర్తిచేసి పుణ్యం కట్టుకోండి నాయనా" అంటూ ఆవిడ ప్రాధేయపడింది.

'మా ఆవిడకు నాలుగో నెలని', 'నాకు జ్వరమని', 'నాకు బుజాల నొప్పి'లని, 'నాకు అమ్మా, నాన్నా వున్నా' రని, నలుగురూ నాలుగు రకాలుగా సాకులుచెప్పి అక్కడి నుంచి తప్పుకున్నారు.

వనజమ్మకు ఓ గంట పోయేసరికి నిద్ర ముంచుకు వచ్చింది. కొంగు పర్చుకుని అక్కడే ఓ కునుకు తీసింది. నిద్రలో ఆవిడకు ఓ కల వచ్చింది. రంగనాధంగారు చని పోయారు. ఆయన బ్యాంకులో వేసిన డబ్బంతా తన ఆధీనం అవుతుంది. దాన్ని వడ్డీలకు తిప్పుతుంది. ఆ డబ్బు ఒకటికి రెండింత లవుతుంది. ఇంతలో ఇరుగింటివాళ్ళూ, పొరుగింటివాళ్ళూ పూర్తిగా చెడిపోతారు. అప్పుల

పాలయి వాళ్ళు కొంపలు అమ్ముకునే స్థితికి వస్తారు. ఆ యిళ్ళన్నీ తను కొంటుంది. చూస్తూండగా తాను పెద్ద శ్రీమంతురాలయి పోతుంది. వనజమ్మగారంటే ఈ పేట పేటంతా మారుమ్రోగిపోతుంది. చుట్టుపక్కల తన మాటంటే విలువ పెరిగిపోతుంది. అందరూ తమ తమ తగూలు తన దగ్గరకు తీసుకు వస్తారు. తను నేర్పుగా వాటిని పరిష్కారం చేస్తుంది." వనజమ్మకు మెలుకువ వచ్చేసింది.

రంగనాథంగారు కాళ్ళు తప తప కొట్టుకుంటూనే వున్నారు.

లోపల గ్లాసు కిందపడిన చప్పుడు వినిపించింది వనజమ్మకు. 'కొడుకూ, కోడలూ ఇంకా మెలుకువగానే వున్నారన్నమాట.'

ఆవిడకు ఉన్నట్టుండి ఓ అనుమానం వచ్చింది. నెమ్మదిగా వెళ్ళి తలుపువద్ద చెవి దోరపెట్టుకుని వినసాగింది.

'నాలుగు రోజులు ఓపిక పట్టు' అంటున్నాడు కొడుకు. 'నాలుగు రోజులాగు ఆ డబ్బురాని, దీనిపని పడదాం' అంటున్నాడు కాబోలు. 'ఆరి దుంపతెగా. ఈ కోడలుముండ అసాధ్యురాలు. ఇది పీడ్ని బుట్టలో వేసుకుని ఎంతయినా చెయ్యగల్దు. ఆ డబ్బు తెచ్చి దీని చేతిలో పోస్తారాయె వాళ్ళు. ఇప్పుడే తను కళ్ళు తెరవకపోతే తన గతి రంగనాథంగారి గతే అవుతుంది.' వనజమ్మ గుండెలు దడదడ లాడాయి.

"ఒరేయ్ అబ్బాయ్" అంటూ పిల్చింది.

కొడుకు తలుపు వోరగా తెరిచి, తల ఇవతల పెట్టి "దేనికే పిల్చావ్?" అన్నాడు.

"నువ్విలా వచ్చికూర్చో" అంటూ కోడలిని హుంకరించింది వనజమ్మ.

"బయట చలిగావుందే. నువ్వే కదుటే దాన్ని లోపలే వుండమన్నావు."

"దాన్ని లోపలే ఉండనీ.నువ్వొచ్చి ఇక్కడ కూర్చో" అంది వనజమ్మ.

అతగాడు నసుగుతూ వచ్చి వనజమ్మ పక్క కూర్చున్నాడు. రంగనాథంగారు గురకపెట్టటం వినిపించిం దావిడకు. కాళ్ళు కదపటం ఆగిపోయింది.

వనజమ్మకి మళ్ళీ నిద్రముంచు కొచ్చింది. ఓ నిమిషం అటూ ఇటూగా తెల్లవారేలోపున ఎలాగూ ఈ బొందిలోంచి జీవుడు నిష్క్రమించటం ఖాయం. అందుకోసరం నిద్ర ఆపుకోవటం తెలివితక్కువ వనిపించిం దావిడకు.

మళ్ళీ నిద్రకు జారుకుంది వనజమ్మ. మళ్ళీ ఆవిడకు కల వచ్చింది. ఇంత పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న తను ఏడాది కేడాది గడిచేసరికి వయోభారంతో ముసలయిపోయి అశక్తురాలయిపోతుంది ఇదే సమయమని కోడలు తనమీద పెత్తనం చెలాయిస్తుంది. కొడుకు పెళ్ళాంవైపుకు వెళ్ళిపోతాడు. ఇద్దరూ కలిసి తన్ని నానా తిప్పలూ పెడతారు. రంగనాథంగారికి తనెన్ని బాధలు పెడుతోందో, తన్ని వాళ్ళు అన్ని బాధలూ పెడతారు. అప్పుడు తనకీ గత్యంతరం లేక తన ఆధిపత్యం నిలబెట్టుకుందుకోసం _ తప్పదు మరి _ ఆపత్సమయంలో ఏంచేసినా తప్పులేదు _ పీడికింత మందుకలిపి తాగించి అదంటే విరక్తిపుట్టేట్టు చేస్తా_" వనజమ్మకు

గుండెలు బరువెక్కిపోయి మెలుకువ వచ్చేసింది. ఇంకా చాలా తెల్లవారలేదు. పక్కింటిలోంచి గిలక చప్పుళ్ళు చీపురు చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.

వనజమ్మ కళ్ళు నులుపుకుని పందిట్లోకి చూసింది. మళ్ళీ యింకా గట్టిగా నులుపుకుని గుడ్లు పెద్దవి చేసుకుని మరీ చూసింది!

రంగనాథంగారి భౌతికకాయం లేచి కూర్చుని రొంటిలోంచి ముక్కుపొడుం డబ్బా చేతిలోకి తీసుకుని నాజూగ్గా ఓపట్టు వేళ్ళమధ్యకు తీసుకుని సుఖంగా పీల్చుకుని, ముక్కు-రుద్దుకుని చేతులు దులుపుకోవటం చూసి వనజమ్మ కెవ్వుమని కేక వెయ్యబోయి మాట పెగలక గుడ్లు తేలేసి రోటికి చారబడిపోయింది.

An improbable, incoherent story
of an unhomely evil woman
loves like a fantasy -
This author should
write fables - not modern
short stories in the real se

6)